
ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
శనివారం 25 ఏప్రిల్ 2026

# వారసుడొచ్చే.. దివ్యకాంతులు తెచ్చే..

◆ 150 ఏళ్ల వారసత్వానికి పునర్జన్మ.. ◆ మొగిలి గిద్దలో కోట మైసమ్మ అమ్మవారి పున ప్రతిష్ట..

◆ అత్యంత వైభవంగా అన్నదాన కార్యక్రమం.. ◆ దేశ్ ముఖ్ దొరల కుటుంబీకులతో ఉత్సవాలకు పూర్వ వైభవం









**షాద్ నగర్,(ప్రజావినికిడి):** అప్పుడు ఈ ప్రాంతంలో పేరు ప్రతిష్టలు సంపాదించిన దొరలు ప్రతిష్టించిన కోట మైసమ్మ అమ్మవారికి వైభవమైన పూజలు, అన్నింటికీ మించి అన్న వితరణ.. ఒక పండుగ వాతావరణంలో ఉత్సవాలు జరిగేవి. కాలక్రమేనా ఆ దొరలు మరణించడంతో ఆలయం బోసిపోయింది.. ఉత్సవాలు ఆగిపోయాయి.. ప్రస్తుతం తిరిగి 150 సంవత్సరాల దివ్యకాంతిని వెలుగులోకి తీసుకొస్తూ వారి వారసుడు రంగంలోకి అడుగుపెట్టారు. అత్యంత వైభవంగా ఉత్సవాలను నిర్వహించి గ్రామానికి కన్నుల పండుగ చేశారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా పెద్ద ఎత్తున వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ముఖ్యంగా స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్,మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్, స్థానిక ప్రజా ప్రతినిధులు తరలివచ్చారు. ఫరూక్ నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో కనిపించిన వైభవం ఇది. ఒక్కసారి వివరంగా చెప్పుకుంటే..

## ఆనాటి వైభవం..

ఫరూక్ నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో శ్రీ కోట మైసమ్మ ఆలయాన్ని అప్పటి దొరలు లంకాల వెంకట అనంతరెడ్డి, చిలకమ్మ రెడ్డి నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్టించారు. అప్పటి చించోడు సంస్థానం వారసత్వంగా ఉన్న కోటలను, గ్రామ ప్రజలను రక్షించడానికి నిర్మించిన ఈ ఆలయంలో ఏటా అమ్మవారికి ఘనంగా పూజలు చేయడం, బొడ్రాయి పండుగ నిర్వహించడం, పెద్ద ఎత్తున తరలివచ్చే భక్తులకు అన్న వితరణ కార్యక్రమం చేయడం వంటివి దొరలు చేసేవారు. వారి తర్వాత కాలంలో వారి వారసులు దొర లంకాల బ్రిజ్ నందన్ రెడ్డి, దొరసాని కుసుమ గీతారెడ్డి కూడా ఈ కార్యక్రమాలను అత్యంత వైభవంగా చేపట్టారు.అయితే కాలక్రమమేనా వారు వెళ్లిపోవడంతో ఈ కార్యక్రమాలు ఆగిపోయాయి. ఆలయం నిర్వహణ లేక మూగబోయింది. ఈ ఆలయానికి ఒక ఘన చరిత్ర ఉంది.శతాబ్ద కాలానికి పైగా గ్రామానికి రక్షక దేవతగా ఈ అమ్మవారు ఉన్నారు.2024 డిసెంబర్ లో గుర్తుతెలియని వ్యక్తులు ఇక్కడ దేవతా విగ్రహాలను కాల్చి వేయడంతో విషాదఘటన చోటుచేసుకుంది. దీనితో గ్రామస్తులు తీవ్ర నిరాశకు గురయ్యారు. గ్రామాన్ని రక్షించే ఈ ఆలయాన్ని పునరుద్ధరించే దాతల కోసం ఎదురుచూపులతో గడిపారు.

## మళ్లీ పూర్వ వైభవం..

చివరికి అదే దేశ్ ముఖ్ కుటుంబానికి చెందిన వారసులుగా రంగంలోకి దిగిన లంకాల రాకేష్ రెడ్డి,ఆయన కుటుంబంలో కోట మైసమ్మ ఆలయానికి పూర్వ వైభవం తెచ్చేందుకు రంగంలోకి దిగారు. ఈ క్రమంలో ఈ నెల 18 నుంచి 20 వరకు ప్రతినిత్యం కార్యక్రమాలు నిర్వహించి ఇక్కడ ఆలయాన్ని పునరుద్ధరించి అమ్మవారిని పునః ప్రతిష్ట చేశారు.ఈ కార్యక్రమంలో నాలుగు వేలకు పైగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొనడం,వారికి స్వతహాగా బోజన సదుపాయం ఏర్పాటు చేయడం విశేషం.భారీ ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు భక్తులందరికీ దొరల వారసులు అన్న ప్రసాద వితరణ చేసి తమ ఔదార్యాన్ని చాటారు.ఈ సందర్భంగా లంకాల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ, అన్న ప్రసాదం కేవలం భోజనం కాదు,అది అమ్మవారి ప్రసాదం.ఈ ఆలయం ఎదుర్కొన్న కష్టాల తర్వాత గ్రామస్తులు అందరూ కలిసి భోజనం చేయడం మాకు అత్యంత సంతోషంగా ఉందని అన్నారు. తమ తాతలు ,తండ్రులు రామ రక్షణ కోసం చేసిన ఈ ప్రయత్నాన్ని కొనసాగించేలా, వారి



జ్ఞాపకాన్ని నిలబెట్టేలా అమ్మవారి మహిమలను వెలుగులోకి తెచ్చేలా తమ ద్వారా కృషి జరిగినందుకు గర్వంగా ఉందని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇక ఈ కార్యక్రమాలు ప్రతి ఏటా కొనసాగుతాయని ఈ సందర్భంగా వారు వివరించారు.ఈ వేడుకల తర్వాత ప్రతి ఒక్కరికి దైవ ఆశీర్వాదం అందుకున్న అనుభూతి కలిగిందని,ఇది ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికిందని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. మొగిలిగిద్ద గ్రామంలో ఆధ్యాత్మిక వైభవాన్ని చూసి గ్రామస్తులు పొంగిపోతున్నారు.



